నిన్నటి రైతులే నేటి కూలీలు

సత్యవేడు నుంచి న్యూస్‌టుడే ప్రత్యేక ప్రతినిధి

సొంత పొలాలకు కావలివాళ్లు ● సత్యవేడు సెజ్‌లో నిష్ఠుర నిజాలు

సిద్ధమ్మ అగ్రహారంలో నిర్వహిస్తోన్న బెల్టుషాపు

ఇరుగళం సమీపంలో కొత్తగా ఏర్పాటైన బ్రాందీషాపు

భూమిని కోల్పోయిన ఏడాది తర్వాత సత్యవేడు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల రైతుల పరిస్థితి ఎలా ఉందో స్వయంగా తెలుసుకోవడానికి 'న్యూస్‌టుడే ప్రత్యేక ప్రతినిధి' ఆ ప్రాంతంలో పర్యటించారు. ఎవరిని కదిపినా కన్నీటిగాథే. ఒక్కొక్కరిది ఒక్కో వేదన. నిన్నమొన్నటిదాకా రైతులుగా గౌరవంగా బతికినవారు.. ఇప్పుడు కూలీలుగా మారారు. దశాబ్దాల తరబడి భూమిని నమ్ముకుని బతికి.. నేడు ప్రత్యేక ఆర్థిక మండలి ప్రాంతంలో వేస్తున్న రోడ్డు పనిలో కూలీలుగా పని చేస్తున్నారు. మా భూమిలో మేమే కూలీలుగా పనిచేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక్కడ ఎక్కువ మందికి పని దొరక్కపోవడంతో ఎక్కడ దొరికితే అక్కడకు వెళ్తున్నారు.

సాగు చేసేవాళ్లం.. రాళ్లు మోస్తున్నాం

'నా మూడున్నర ఎకరాల పొలం, మామిడిచెట్లు పోయాయి. పని ఇస్తామని ఇవ్వలేదు. ముసలోళ్లు మీకేం పని అంటున్నారు. నిండా మోసం చేశారు. రోడ్డు పనికి రాళ్లు ఎత్తేయడానికి వచ్చాం. ఇష్టం ఉంటే చేయండి లేదంటే పొమ్మంటున్నారు. ఐదేసి సెంట్ల ఇళ్ల స్థలమిస్తామన్నా ఇవ్వలేదు. మగాళ్లకు రూ.130, ఆడోళ్లకు రూ.100 కూలిగా ఇస్తున్నారు. మా భూములు, తోటల చుట్టూ కంచె వేస్తున్నాం.. వెళ్లిపొండని అంటున్నారు. వచ్చిన పరిహారం డబ్బు నలుగురు పిల్లలకు పంచేశాను. సాగు చేసుకుని బతికేవాళ్లం ఇప్పుడు రాళ్లు మోస్తూ బతకాల్సి వస్తోంది' అని కుచేలునాయుడు వాపోయారు.

ముసలోళ్లకు పని లేదంటున్నారు

'నాలుగన్నర ఎకరాలు పోయింది. మెట్ట పొలాలని ఏడు లక్షల రూపాయలు ఇచ్చారు. కొద్దిగా నేల తీసుకున్నా. ముసలోళ్లం, అయినా చేయకపోతే గడవదు కదా! అందుకే రాళ్ల పనికి వచ్చాం. ముసలోళ్లకు పని లేదంటున్నారు. మా పొలాలు మాకు ఇచ్చేస్తే వారిచ్చిన డబ్బు తిరిగి వెనక్కిఇస్తాం. బతకలేక కూలి చేసుకుంటున్నాం. 70 మూటల వడ్లు పండించేవాడిని. కాడెద్దులు ఉండేవి. నేల పోయాక గొడ్లు ఎందుకని అమ్మేశాను. ఈ పని కూడా ఇష్టం ఉంటే చేయండి లేకుంటే పొమ్మంటున్నారు' అని కొల్లేరిపాళెం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం విలపించారు.

అప్పుడు 80-90 వేలు వచ్చేవి

'రెండెకరాల 75 సెంట్ల భూమి కోల్పోయా. వచ్చిన పరిహారం ముగ్గురు పిల్లలు తలా కొంచెం తీసుకుని ఎవరిదారి వారు చూసుకున్నారు. భూమి ఉన్నప్పుడు వచ్చే ఆదాయం వేరు. మల్లి, రోజా పూలతోటలు ఉండేవి. శనగ పండించే వాళ్లం. ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.90 వేలు వచ్చేది. ఇప్పుడు కూలి పనిచేసుకొని బతుకుతున్నాను. వేరే ఊళ్లకు పోతే ముసలోళ్లను పనికిలోకి రానివ్వడం లేదు' అని శ్రీహరికోట కాలనీకి చెందిన నిమ్మల పార్వతమ్మ వాపోయింది.

వ్యవసాయ కూలీల పరిస్థితి దుర్భరం

మల్లవారిపాళెం గ్రామానికి చెందిన మల్లయ్య, నాగయ్య, రంగయ్య భూమిలేని వ్యవసాయ కూలీలు. కట్టెపుల్లలు పట్టుకుని వెళ్తుండగా న్యూస్‌టుడే ప్రతినిధి వారితో మాట్లాడే ప్రయత్నం చేశారు. వారు చెప్పడానికి చాలా సేపు జంకారు. శ్రీసిటీ యాజమాన్యం వాళ్లేమోనని భయపడ్డారు. భయం తీరాక మాట్లాడారు. 'చిన్నప్పటి నుంచి ఇక్కడ మామిడి చెట్లకు కాపలా ఉన్నాం. కూలి పనులకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఎక్కడ పని దొరికితే అక్కడకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంటచెరకు కోసం పుల్లలు ఏరుకోవడానికి కూడా వీలులేకుండా వాచ్‌మెన్లను పెట్టారు' అని మంగయ్య వాపోయాడు. ఇతర ప్రాంతాల్లో వరి నాట్లకు వెళ్దామంటే ఇప్పటికే అక్కడ కూలీలు ఉన్నారు. మేమెక్కినా దొరకవు. వారికి అవసరమైతే ట్రాక్టర్లలో వచ్చి తీసుకెళ్తున్నారు. ఈ పనులు అప్పుడప్పుడు మాత్రమే దొరుకుతున్నాయని పలువురు మహిళలు వాపోయారు. పక్కనున్న తమిళనాడుకు కూడా నాట్లు వేయడానికి వెళ్తున్నామని తూర్పు మల్లెవారిపాళెం గ్రామానికి చెందిన జానకి పేర్కొంది. ఆరూరు గ్రామానికి సమీపంలో శ్రీసిటీ యాజమాన్యం ప్రత్యేకంగా ఓ నర్సరీని అభివృద్ధి చేస్తోంది. ఈ గ్రామానికి చెందిన 30 మంది మహిళలు ఆ నర్సరీలో పని చేస్తున్నారు.

కోర్టుల చుట్టూ చక్కర్లు

భూమిని నమ్ముకున్న సత్యవేడు అన్నదాతలకు సాగు తప్ప మరొక పని చేతకాదు. ఇంకో రకంగా బతకనూలేరు. అందుకే కొందరు ప్రభుత్వంపై న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. మొదటి విడత సేకరణ పరిధిలోని కొందరు రైతులు కోర్టును ఆశ్రయించి పోరాడుతుండగా.. రెండో విడత సేకరణ పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇరుగళం గ్రామానికి చెందిన రైతులు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు.

ఇరుగళం రైతులకు మల్లవారిపాళెంలో మామిడి తోటలున్నాయి. మొదటి దశ భూసేకరణలో ఈ తోటలు తీసేసుకున్నారు. ఇప్పుడు ఇరుగళంలో ఉన్న భూమిని కూడా తీసుకోవడానికి సర్వే చేయడంతో రైతులు న్యాయపోరాటానికి దిగారు. 860 ఎకరాల పట్టా భూమి. చెరువు కింద ఉంది. ఏ పరిస్థితుల్లోనూ పదులుకోవడానికి గ్రామస్తులు సిద్ధంగా లేరు. 'మొదట ఐదెకరాల మామిడితోట తీసుకున్నారు. ఇప్పుడు మిగిలిన పదెకరాలు కూడా ఇమ్మంటున్నారు. పక్క ఊర్లో ఏమి జరిగిందో చూశాం. వచ్చిన పరిహారమంతా అయిపోయి వారంతా ఖాళీగా కూర్చున్నారు. చుట్టుపక్కల ఎక్కడా ఎకరమైనా కొనలేని పరిస్థితి. అందుచేత మా భూములిచ్చేది లేదు' అని మునిచంద్రారెడ్డి అనే రైతు తెగేసిచెప్పారు. 'మా రైతులు గతంలో వ్యవసాయ రుణం తీసుకున్నారు. పరిహారం చెక్కు బ్యాంకులో వేయగానే.. ఆ రుణం మినహాయించుకుని మిగిలింది చేతిలో పెట్టారు. నా ఒక్కడికే రూ.90 వేలు పోయింది' అని వాపోయారు. ఇరుగళం ఎస్‌బీఐ అధికారులు అందించిన సమాచారం ప్రకారం.. రైతులకు అందిన పరిహారం నుంచి మినహాయించుకున్న మొత్తం సుమారు రూ.మూడు కోట్లు. తర్వాత కేంద్రం రుణ మాఫీ ప్రకటించడంతో బ్యాంకు పరిధిలోని 19 గ్రామాలకు రూ.3.14 కోట్లు మాఫీ అయింది. బ్యాంకులు పరిహారం నుంచి ముందుగానే రుణం మొత్తం మినహాయించుకోవడంతో రైతులకు మాఫీ అర్హత లేకపోయింది. రెండు రకాలుగా వారు నష్టపోయారు. భూమీ పోయింది.. పరిహారమూ పోయిందని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు ఉచ్చు

మొదటి దశలో రైతులు కొంత భూమి ఇచ్చారు. ఇప్పుడు అధికారులు మిగిలిన భూమిపైనా కన్నేశారు. రైతులు ఇచ్చే పరిస్థితిలో లేరని గ్రహించి వారి చుట్టూ ఉచ్చు పన్నుతున్నారు. వ్యవసాయ రుణాలు మంజూరు కాకుండా అడ్డుకున్నారు. ఎస్ ఈజడ్ ప్రకటించాక ఎలా ఇస్తామని బ్యాంకులు కొర్రీలు వేస్తున్నాయి. కలెక్టరు నుంచి అనుమతి తెచ్చుకుంటేనే రుణం ఇస్తామంటున్నాయి. అప్పుపుట్టకపోతే రైతు సాగు చేయలేడని, విధిలేక ఇచ్చేస్తాడని అధికారుల వ్యూహం. ఇలాంటి ఒత్తిళ్లకు తలొగ్గబోమని శ్రీరాములురెడ్డి అనే రైతు స్పష్టం చేశారు. రెండో విడత భూసేకరణలో భాగంగా తమ గ్రామంలో కూడా సర్వే చేశారని రాళ్లకుప్పం రైతాకరు చెప్పారు. ఎక్కువమంది రైతులు ఇక్కడ వరి, చెరకు పంటలు సాగు చేస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన 13 మంది రైతులు కోర్టుకెళ్లి స్టే తెచ్చారు. మొదట విడత భూసేకరణ చేసిన శ్రీహరికోట కాలనీలో కూడా భూమి ఇవ్వడానికి నిరాకరించిన రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ కాలనీ వాసుల పరిస్థితి మరీ దయనీయం. గతంలో షార్ నిర్మాణం వల్ల ఒకసారి నిర్వాసితులయ్యారు. ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఐదెకరాలు ఇస్తామని రెండున్నర ఎకరాలే ఇచ్చింది. ఇప్పుడు అది కూడా లాక్కొంటే తమ గతి ఏంటని మాజీ సర్పంచి శేషన్న ప్రశ్నించారు. పరిహారం తీసుకోబోమని రైతులు భీష్మించుకుని కూర్చుంటే.. అధికారులు బెదిరింపులకు దిగుతున్నారు. సర్కారు ఇచ్చిన భూమే కాబట్టి తిరిగి స్వాధీనం చేసుకుంటామని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పాస్‌బుక్, టైటిల్ డీడ్ అన్నీ ఉన్నా అవేమీ చెల్లవంటున్నారని తెలిపారు. ఈ గ్రామంలో 104 కుటుంబాలు ఉంటే.. అధికారుల ఒత్తిడికి తట్టుకోలేక 70 మంది పరిహారం తీసుకున్నారు. 34 కుటుంబాలు మాత్రం ఇంకా కోర్టు ద్వారా పోరాడుతూనే ఉన్నాయి. ప్రత్యామ్నాయ భూమి చూపించండంటూ కాలనీ వాసులు ప్రభుత్వానికి కోర్టు ద్వారా నోటీసు ఇచ్చారు. కోర్టు ఖర్చుల కోసం ఇప్పటిదాకా సుమారు రూ.3 లక్షలు ఖర్చయిందని శేషన్న తెలిపారు.

రోజూ రూ.వెయ్యి పూలమ్మేవాడిని

రోజూ వెయ్యి రూపాయల పూలమ్మేవాడినని తొండూరు సొసైటీకి చెందిన వీరయ్య తెలిపారు. 'రెండున్నర ఎకరాల భూమి ఉంటే, రెండెకరాల్లో మామిడితోట. అరెకరంలో మల్లెపూలు, రోజా తోట వేయడానికి పోతున్నా. కూలి పనులకు ట్రాక్టర్లు, ఆటోల్లో వచ్చి తీసుకెళ్తారు. వర్షాలొస్తే పనులుండవు. ఉన్నకాడికి తిని పస్తులుండటమే. నేలపోయాక ఊర్లో కూలి కూడా దొరకడం లేదు' అని తొండూరు సొసైటీకి చెందిన పచ్చమ్మ చెప్పింది.

ఎకరమే మిగిలింది: సదాశివయ్య

రాసపాళెంవాసి సదాశివయ్య అనే రైతుకు చెందిన 11.5 ఎకరాల భూమిని ప్రత్యేక ఆర్థిక మండలి కోసం తీసుకున్నారు. ఇంకా ఎకరం 15 సెంట్లు మిగిలింది. ఇప్పుడు దాన్ని కూడా ఇవ్వాలంటున్నారు. 'గ్రామంలో ఉన్న పెద్ద రైతుల్లో నేనొకడిని. మొత్తం రూ.30 లక్షలు పరిహారం వచ్చింది. ఎక్కడ కొండామన్నా ఎకరా రూ.15 లక్షలు చెబుతున్నారు. శ్రీకాళహస్తిలో ఐదు లక్షల రూపాయలు పెట్టి 25 అంకణాలు కొన్నా. అది కూడా మునిగిపోయింది. రూ.14 లక్షలు బ్యాంకులో పెడితే, రూ.తొమ్మిది వేలు వడ్డీ వస్తోంది. నలుగురు పిల్లలు. అన్ని రేట్లూ పెరిగాయి. పిల్లల చదువులు, పెరిగిన ధరలకు ఈ మొత్తం ఎలా సరిపోతుంది? వరి, శనగ, మల్లె పూలు పండించి సంతోషంగా గడిపేవారం. మిగిలిన ఎకరంలో పూలతోట పెట్టుకుని ఎలాగోలా బతుకుదామంటే, దానిని కూడా ఇచ్చేయమని ఒత్తిడి చేస్తోన్నారు' అని వాపోయారు. తమ పరిస్థితే ఇలా ఉంటే ఇక ఎకరా, రెండెకరాలు మాత్రమే ఉండి కోల్పోయిన వారి పరిస్థితి ఇంకెంత దయనీయంగా ఉందోనని అన్నారు.

కూలి దొరికితేనే కాలేజి

ఎలావూరు మధు

సందీప్

ప్రత్యేక ఆర్థిక మండలి లక్షల ఉద్యోగాలొస్తాయంటున్న సర్కారు.. దాని ఏర్పాటువల్ల స్థానికుల చదువులు సర్వనాశనమవుతాయన్న విషయాన్ని విస్మరించింది. సత్యవేడు సెజ్ ఏర్పాటుతో నిర్వాసితులైంది చిన్న సన్నకారు రైతులే. వీరితోపాటు పొలం పనులపై ఆధారపడిన వ్యవసాయ కూలీల బతుకూ బజారునపడింది. అటు రైతులు, ఇటు కూలీల్లో అధికులు దళితులు, బలహీన వర్గాల యువకులే. 'భూమి ఉంటే అప్పు పుట్టేది. వచ్చిన పరిహారం ఖర్చయిపోయింది. ఇక్కడ పనులేమీ దొరకడం లేదు. కూలి పని దొరికితే పిల్లలను కాలేజీకి పంపుతున్నాం. కూలి దొరక్కపోతే ఆపేస్తున్నాం' అని పలువురు నిర్వాసితులు చెప్పారు. కూలి దొరికితే కాలేజీకి వెళ్తాం.. లేకుంటే లేదని తొండూరుకు చెందిన ఎలావూరు మధు చెప్పాడు. ఇతడు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. 'భూమి పోయింది. వచ్చిన డబ్బుతో చిన్న ఇల్లు కట్టుకున్నాం. రోజూ పోయి రావడానికి రైలుకైతే రూ.10, బస్సుకు రూ.14 అవుతోంది. కూలి పని రెండురోజులు దొరక్కపోతే కాలేజీకి వెళ్లలేని పరిస్థితి. పని లేకపోతే తినడానికే కష్టం. ఇక చదువుకోవడానికి ఎలా వెళ్తాను' అని వాపోయాడు.

మురళీ మనోహర్

సూళ్లూరుపేటలోనే ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సందీప్‌దీ ఇదే పరిస్థితి. మురళీ మనోహర్ అనే విద్యార్థి సూళ్లూరుపేటలో బీఎస్సీ చదువుతున్నాడు. ఛార్జీలకు డబ్బు లేక ఈ నెలలోనే పది రోజులకుపైగా మానేసినట్లు తెలిపాడు. 'పరిహారం పచ్చి ఏడాదైంది. ఇప్పటిదాకా బతికింది ఒక ఎత్తు. ఇక ఉంది అసలు సమస్య. ఎలా బతకాలా అన్నది ఆందోళన. వలస వెళ్లక తప్పేలా లేదు. ఇంటికో ఉద్యోగం, ఇంటి స్థలం అన్నారు. ఇప్పుడు అడిగితే ఉలుకూపలుకూ లేదు. ఒక పూట తింటే ఇంకో పూట పస్తులుంటున్నాం, పిల్లలను కాలేజీకి పంపించడానికి రోజూ రూ.14 ఎక్కడి నుంచి తెస్తాం' అని తొండూరుకే చెందిన అలివేలమ్మ పేర్కొంది.

అనాథల్లా బతుకుతున్నాం

'రెండున్నర ఎకరాల పొలం పోయింది. రూ.6.25 లక్షలు వచ్చింది. ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుర్లు. ఉన్న అప్పు, వచ్చిన మొత్తం బాగాలు చేసి పంచా. నా భాగం రూ.15 వేలు వచ్చింది. కూలి పనిచేసుకుని అనాథలా బతుకుతున్నాను' అని తొండూరు గ్రామానికి చెందిన కండ్రిగ సుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. భూమి అడగడానికి వచ్చినప్పుడు తనకు కూడా ఉద్యోగమిస్తానని చెప్పారని, ఇప్పుడడిగితే మీరేమీ చదువుకోలేదు కదా అని మొండిచెయ్యి చూపుతున్నారని కాటారి సుబ్బయ్య అనే వ్యక్తి వాపోయాడు.

10-15 కిలోమీటర్ల దూరం కూలికి పోతున్నా

'రెండెకరాలు పోయింది. రూ.ఐదు లక్షలు ఇచ్చారు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేశా. ఇప్పుడు రోజూ 10, 15 కి.మీ దూరం కూలి పనికి నాట్లు పెట్టా. రోజూ మద్రాసుకు పూలు తీసుకెళ్లి వెయ్యి రూపాయలు తెచ్చేవాడిని. తొండూరు సొసైటీలో డి.కె.టి భూమి. అడ్డు తిరిగితే ఒక రూపాయి కూడా లేకుండా లాక్కొంటుందని భయపడి ఇచ్చేశాం. భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు. ఏదో తరగతి చదివా. ఏం ఉద్యోగం వస్తుంది? అప్పుడు మేం పండించి అమ్మే వాళ్లం. ఇప్పుడు బియ్యం కొని తింటున్నాం.

మట్టిపనిచేసుకునేవారికి ఏం ఉద్యోగాలు?

మొదటి విడత సేకరణలో 1235 కుటుంబాలు భూమిని కోల్పోతే, ఇందులో 1090 మంది దళితులు, బలహీన వర్గాలకు చెందిన వారే. వీరికి వచ్చిన పరిహారంతో చుట్టు పక్క ప్రాంతాల్లో భూమిని కొనే పరిస్థితి లేదు. రెండెకరాలు పోతే సాగుకు పనికి రాని భూమి 50 సెంట్లు కూడా కొనలేకపోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన పరిహారం అప్పులకు, పెళ్లిళ్లలకు, తాగుడుకు, మోటారు సైకిళ్ల కొనుగోలుకు ఇలా పలు రకాలుగా ఖర్చుచేశారు. ఇప్పుడు గ్రామంలో ఏ రైతు చేతిలో భూమి లేక పోవడంతో చేయడానికి కూలి పనులు కూడా లేవు. దూరంలో ఉన్న గ్రామాలకు వెళ్తే అక్కడ ఇప్పటికే కూలీలు ఉన్నారు. ఇప్పటివరకు వచ్చిన పరిహారం తినేశాం. రానున్న రోజుల్లో బతుకు ఎలా వెళ్లదీయాలో అర్థం కావడం లేదని తొండూరు గ్రామానికి చెందిన కె.సుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పడమటి మల్లెవారిపాళెం గ్రామానికి చెందిన ఎం.రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. 'మా గ్రామంలో 650 ఎకరాల మామిడి తోటలు తీసుకున్నారు. 23 ఎకరాల భూమిలో 770 మామిడి చెట్లు, 25 ఏళ్ల పాటు ప్రాణం కంటే ఎక్కువగా పెంచాను. ఎకరాకు రూ.రెండున్నర లక్షలు, మామిడిచెట్టుకు రూ.6500 చొప్పున ఇచ్చారు. తీసుకుని ఏడాది దాటినా ఇప్పటివరకు ఎలాంటి ఫ్యాక్టరీలు రాలేదు. మామిడితోటకు కంచె వేశారు. తోటను తమిళనాడుకు చెందినవారికి వేలం వేస్తున్నారు. మీరిచ్చిన ధర ఇస్తాం.. ఈ ఏడాది కాపు మాకిమ్మని అడిగినా కుదరదన్నారు' అని చెప్పారు. ఫ్యాక్టరీ కోసమని తీసుకుని, ఇప్పుడు తమిళనాడు వాళ్లకు అమ్ముకున్నారని వాపోయారు. మా దగ్గర కొన్నదానికంటే ఎక్కువరేటుకు అమ్ముకొంటున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఊళ్లను కూడా ఖాళీ చేయాల్సి వస్తుందేమోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. భూమి తీసుకున్నప్పుడు ఊరికి పక్కన కనీసం 15 నుంచి 20 మీటర్లు వదిలిపెట్టి కంచె వేస్తామన్నారు. ఇప్పుడు ఎంత వరకు భూములు తీసుకున్నారో అంతవరకు వేస్తున్నారు. ఐదు మీటర్లు కూడా వదిలిపెట్టడం లేదు. కొన్నాళ్లు పోతే పశువులు మేపడానికి కూడా వీలుండదు. రాకపోకలకు రోడ్డయినా ఉంచుతారో లేదోనన్న భయం ఏర్పడింది. అప్పుడు ఊళ్లో కూడా ఉంటే పరిస్థితి ఉండదని పలువురు నిర్వాసితులు పేర్కొన్నారు. డి.కె.టి, పట్టా భూములు కలిపి ఏడు ఎకరాలు ఉంటే ప్రస్తుతం రెండున్నర ఎకరాలు మిగిలింది.. ఇప్పుడు అది కూడా ఇచ్చేయమని ఒత్తిడి చేస్తున్నారని ఆరూరు గ్రామానికి చెందిన రఘు వాపోయారు. ఇంటిస్థలం ఎక్కువగా ఉంటే.. మీకు అంతెందుకు.. మూడు, నాలుగు సెంట్లు చాలదా అని అధికారులు అంటున్నారని, దీనినిబట్టి భవిష్యత్తులో ఊరిని కూడా స్వాధీనం చేసుకునే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిలకు ఘనంగా పెళ్లిళ్లు జరుగుతోన్నాయి. అబ్బాయిలకు మాత్రం పెళ్లిళ్లు కావడం లేదని గ్రామస్థులు వాపోయారు. భూమైనా లేకుండా అమ్మాయిని ఎలా ఇస్తామని ప్రశ్నిస్తున్నారని చెప్పారు.

రఘునాథరెడ్డి

కావలివారుగా మారిన రైతులు

నిన్నటిదాకా తమ భూముల్లో సాగుచేసుకునే రైతులు.. నేడు అక్కడే కాపలాకు కుదిరారు. సెక్యూరిటీ గార్డులుగా నియమితులైన వారిలో ఎక్కువమంది దళిత యువకులున్నారు. సెజ్‌కు రెండెకరాలు పోతే 50 సెంట్లు కొనుక్కోగలిగామని సిద్ధమ్మ అగ్రహారానికి చెందిన రామకృష్ణయ్య తెలిపారు. 'రెండెకరాల భూమి పోయింది. రూ.ఐదు లక్షలు వస్తే ఇద్దరు అన్న దమ్ములం పంచుకున్నాం. 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పంబాకం వద్ద 50 సెంట్ల భూమి కొన్నాం. అందులో ఇప్పుడే పండించే పరిస్థితి లేదు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇచ్చారు. ఇది కూడా కొద్ది రోజులు మాత్రమే ఉంటుందంటున్నారు. ఒక రోజు రాలేకపోతే రూ.70 కోత పడుతోంది. ఇంట్లో 12మంది ఉన్నాం. పెరిగిన ధరలతో రూ.2100తో ఇంత మందిమి ఏంతినాలి' అని రామకృష్ణయ్య బావురుమన్నాడు. చెంగంబాకానికి చెందిన పి.రమణయ్యది కూడా ఇదే పరిస్థితి. చిలమత్తూరుకు చెందిన కుమారరాజా కూడా సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. 60 సెంట్ల భూమికి పరిహారంగా రూ.లక్షన్నర వచ్చింది. నలుగురు అన్నదమ్ములు. కంపెనీలు వచ్చాక వాటికి బదిలీ చేస్తామంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన రాజేంద్రకు 30 సెంట్లు భూమి పోతే సెక్యూరిటీ గార్డు ఉద్యోగం వచ్చింది. కుటుంబమంతా ఇతడిపైనే ఆధారపడి బతుకుతోంది. రోజుకు రూ.70 వస్తే పెరిగిన ధరలతో ఏ మూలకు వస్తుందంటూ ప్రశ్నించారు. పైగా ఉద్యోగానికి వెళ్లడానికి ద్విచక్ర వాహనం అవసరం. కొందరు తమకు వచ్చిన పరిహారంలో కొంత వాహనాలకు వెచ్చించారు. మరికొందరు అప్పుచేసి కొన్నారు. వచ్చే జీతం పెట్రోలుకే చాలడం లేదు. ఇక బతకడమెలాగని జానకి అనే మహిళ ప్రశ్నించింది. ఈ ఉద్యోగాలు కూడా సిఫార్సు ఉన్నవారికే లభిస్తున్నాయని పలువురు యువకులు వాపోయారు.


సెక్యూరిటీ గార్డులు మారిన రైతులు రామకృష్ణయ్య, రమణయ్య

ఐదెకరాలు పోతే ఐదు సెంట్లు కొన్నాం

ఐదెకరాల భూమి సెజ్‌లో పోయింది. పరిహారంగా రూ.8 లక్షలు వచ్చింది. చుట్టు పక్కల ఎక్కడా వ్యవసాయ భూమి కొనే పరిస్థితి లేదు. పక్కనున్న తమిళనాడులోని ఆరంబాకంలో రూ.9 లక్షలు పెట్టి ఐదు సెంట్ల స్థలం తీసుకున్నా. ఇక్కడ ఎవరికీ పనులు లేవు. పక్క నున్న తమిళనాడుకు వరినాట్లకు పోతున్నాం.

- చొక్కమ్మ, ఆరూరు సర్పంచ్